తెలుగు ప్రజల పక్షం - మన వార్తా ప్రపంచం

# వార్తా ప్రపంచం

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL.34393/2010






DR.BANDI SURENDRA BABU
NATIONAL PRESIDENT (DELHI)


Simultaneoulsy Published from Andhra Pradesh &Telangana

సంపుటి: 12 సంచిక : 516 ఎడిటర్ బండి సురేంద్రబాబు, శనివారం, మార్చి 16, 2024 పేజీలు: 8 వెల 1


## ఆ 16 సీట్లలో అభ్యర్థులపై తీవ్ర ఉత్కంఠ, సీనియర్ల భవిష్యత్తు ఏంటి?

అమరావతి/ వార్తా ప్రపంచం: ఎన్నడూ లేనట్లు టీడీపీ చరిత్రలోనే తొలిసారి ఎన్నికల షెడ్యూల్ ముందే అభ్యర్థులను ప్రకటించారు చంద్రబాబు. పొత్తులు, సీట్ల సర్దుబాటు అన్నీ కొలిక్కి తెచ్చేశారు. పోటీ చేద్దామనుకున్న 144 సీట్లలో 128 అభ్యర్థుల పేర్లను ముందే ప్రకటించడం ఓ రికార్డు కాగా.. ఇంకా బ్యాలెన్స్ ఉన్న 16 సీట్లే అధినేతకు తలనొప్పిగా మారాయని అంటున్నారు. ఈ 16 సీట్లలో చంద్రబాబు లెక్క ఒకటైతే అక్కడ స్థానిక లీడర్లు ఇంకో లెక్కలు వేస్తుండటం చికాకుగా మారిందట. తెలుగుదేశం పార్టీలో రెండో జాబితా విడుదలైన తర్వాత లెక్కలన్నీ మారుతున్నట్లు కనిపిస్తోంది. పొత్తుల్లో భాగంగా కీలకమైన స్థానాలను మిత్రపక్షాలకు వదిలేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్న పసుపు దండు.. ఓవైపు అగ్గి పుట్టిస్తుండగా.. మరోవైపు సీట్లు దక్కని సీనియర్లు భవిష్యత్తు వ్యూహాలతో పార్టీకి డేంజర్ సిగ్నల్స్ ఇస్తున్నట్లు చెబుతున్నారు.

### గంటా, ఉమ, సోమిరెడ్డి, వసంత రాజకీయ భవిష్యత్తుపై ఊహాగానాలు..

తొలి, మలి జాబితాలో సీట్లు దక్కని సీనియర్లు గంటా శ్రీనివాసరావు, కళా వెంకట్రావు, దేవినేని ఉమా, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో పాటు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం, వసంత కృష్ణ ప్రసాద్ రాజకీయ భవిష్యత్తుపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని సీనియర్ నేతలైన కళావెంకట్రావు, గంటా శ్రీనివాసరావుతో పాటు

(మిగతా 2వ పేజీలో)




## రాత్రంతా ఈడీ ప్రధాన కార్యాలయంలోనే ఎమ్మెల్సీ కవిత..

## ఇవాళ కోర్టులో హాజరుపర్చనున్న ఈడీ

హైదరాబాద్/ వార్తా ప్రపంచం: సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను శుక్రవారం ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు తెరమీదకు వచ్చిన ఏడాదిన్నర తరువాత కవిత అరెస్ట్ అయ్యారు. సౌత్ గ్రూప్ సభ్యుల్లో కవితదే చివరి అరెస్ట్. అరెస్టయిన వారు ఇచ్చిన స్టేట్ మెంట్ల ఆధారంగా పలుమార్లు నోటీసులు ఇచ్చి విచారించారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం కవిత ఇంట్లో రైడ్స్ చేసి ఈడీ అధికారులు ఆమెను అరెస్టు చేశారు. హైదరాబాద్ విమానాశ్రయంలో రాత్రి 8.45 గంటలకు ఆమెను విమానంలో ఢిల్లీకి ఈడీ అధికారులు తరలించారు. రాత్రి 11.30 గంటలకు కవిత ఢిల్లీ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. దీంతో ఆమెను అక్కడి నుంచి ఈడీ అధికారులు ప్రత్యేక కారులో ఎన్ ఫోర్స్ మెంట్ ప్రధాన కార్యాలయంకు తరలించారు. రెగ్యూలర్ రూట్ లో కాకుండా వేరే మార్గంలో కవితను తరలించారు. అప్పటికే కార్యాలయం వద్దకు వైద్య బృందం చేరుకోవటంతో

(మిగతా 2వ పేజీలో)

## సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన

# ముద్రగడ పద్మనాభం, ఆయన కుమారుడు



అమరావతి/ వార్తా ప్రపంచం: మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వైసీపీలో చేరారు. శుక్రవారం ఉదయం తాడేపల్లిలోని సీఎం జగన్ నివాసంకు కుమారుడు గిరితో కలిసి ముద్రగడ పద్మనాభం వెళ్లారు. జగన్ వారిద్దరికి వైసీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితోపాటు పలువురు ముద్రగడ అనుచరులు వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా ముద్రగడను సీఎం జగన్ ఆప్యాయంగా హత్తుకొని అభినందనలు తెలిపారు. గత కొద్దిరోజులుగా ముద్రగడ వైసీపీలో చేరుతున్నట్లు ప్రచారం జరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో వైసీపీ నేతలు ముద్రగడ నివాసంకు వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. వైసీపీలో చేరాలని ఆహ్వానించారు. దీంతో గత మూడు రోజుల క్రితం వైసీపీలో చేరుతున్నట్లు ముద్రగడ ప్రకటించారు. ఎలాంటి హంగూఆర్భాటం


(మిగతా 2వ పేజీలో)

## ఏపీ ఎన్నికల రంగంలోకి

# తెలంగాణ సీఎం

## రేవంత్ రాకతో

## కాంగ్రెస్ లో ఫుల్ జోష్



అమరావతి/ వార్తా ప్రపంచం: ఏపీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలు దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికే టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడిగా వేదికగా భారీ బహిరంగ సభ నిర్వహిస్తుండగా, సీఎం జగన్ మాత్రం నా కల.. నా లక్ష్యం అంటూ సరికొత్త పంథాలో ముందుకు సాగుతున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ కూడా అదేస్థాయిలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని ఫిక్స్ అయ్యింది. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో విశాఖ జిల్లా కాంగ్రెస్ నేతలు తమ

(మిగతా 2వ పేజీలో)




## పగలు సెగలు రేగుతున్న

# పల్నాడు పాలిటిక్స్

### మామ అల్లుళ్ల మధ్య బిగ్ ఫైట్

పెదకూరపాడు/ వార్తా ప్రపంచం: అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ రాజకీయాలు దూకుడు పెంచాయి. ముఖ్యంగా పల్నాడు జిల్లా పెదకూరపాడులో పగలు సెగలు రేగుతున్నాయి. మామా - అల్లుళ్ళ మధ్య మాటల యుద్ధం మొదలు కాకముందే మంటల్లో కార్యాలయాలు మండిపోతున్నాయి. ఇంకా నోటిఫికేషన్ రాకముందే రెండు పార్టీల కార్యకర్తలు తమ తడఖా చూపిస్తామంటూ సోషల్ మీడియా వేదికగా

(మిగతా 2వ పేజీలో)




## ఉమ్మడి విశాఖ జిల్లాలో అసంతృప్తి సెగలు..

## టీడీపీ, జనసేన నాయకులు రాజీనామాల బాట

విశాఖపట్నం, వార్తా ప్రపంచం: టీడీపీ రెండో జాబితా కూటమిలో చిచ్చు రాజేసింది. అసంతృప్తి పెల్లుబికుతోంది. ఒకవైపు టీడీపీ నేతలు, మరోవైపు జనసేన నేతలు రాజీనామాల బాటపడుతున్నారు. ముఖ్యంగా ఉమ్మడి విశాఖ పట్టణం జిల్లాలో నేతల అసంతృప్తి తారాస్థాయికి చేరింది. టికెట్ దక్కని ఆశావహులు ఆవేదనతో టీడీపీ, జనసేన పార్టీలకు రాజీనామాలు చేస్తున్నారు. అనకాపల్లి నియోజకవర్గం టికెట్ దక్కకపోవటంతో జనసేనకు రాజీనామా చేస్తున్నట్లు పరుచూరి భాస్కర్ ప్రకటించారు. ఇటీవల ఆయన మాట్లాడుతూ..

(మిగతా 2వ పేజీలో)

# టీడీపీలో హైటెన్షన్..

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మహిళా నేత గౌతు శిరీషకు టికెట్ ప్రకటించలేదు.

మాజీమంత్రి గంటా శ్రీనివాసరావు సీటుపై కొంత ఊగిసలాట నడుస్తుండగా.. ఎలాగైనా భీమిలిలో పోటీ చేయాలనే ఉద్దేశంతో ఆయన జనసేన నుంచి భీమిలి టికెట్ తెచ్చుకోవాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. గంటా పోటీపై చంద్రబాబు పట్టిన పట్టు వీడటం లేదని తెలుస్తోంది. అయితే చీపురుపల్లి లేదంటే పార్టీకి సేవ చేయాలని చంద్రబాబు తెగేసి చెబుతుండటంతో.. గంటా ప్రత్యామ్నాయం వెతుకున్నట్లు తెలుస్తోంది.

**చంద్రబాబుపై కళా వెంకటరావు ఒత్తిడి..**

ఇక మరో సీనియర్ నేత కళా వెంకటరావుతోపాటు ఆయన సోదరుడి కుమారుడైన విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున టికెట్‌పైనా హైడ్రామా కొనసాగుతోంది. ఎచ్చెర్ల టికెట్‌ను కళా ఆశిస్తుండగా, స్థానికంగా ఆయనకు పార్టీలో తీవ్ర పోటీ ఎదుర్కొంటున్నారు. ఇదే సమయంలో విజయనగరం ఎంపీగా పోటీ చేయమని పార్టీ ప్రతిపాదిస్తుండటంతో తర్జనభర్జన పడుతున్నారు కళా వెంకటరావు. గత రెండు రోజులుగా సన్నిహితులతో చర్చిస్తున్న కళా.. ఎచ్చెర్ల సీటు కోసం అధినేత చంద్రబాబుపై ఒత్తిడి చేస్తున్నారు.

**టీడీపీకి కత్తిమీద సాములా అభ్యర్థుల ఎంపిక..**

ఇదే సమయంలో నాగార్జున సీటుపైనా ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లో విజయనగరం ఎంపీ, చీపురుపల్లి, ఎచ్చెర్ల అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక టీడీపీకి కత్తిమీద సాములా తయారైందంటున్నారు. చీపురుపల్లిలో గెలిచే అభ్యర్థిని బరిలోకి దించడం ద్వారా ఉత్తరాంధ్రలో సీనియర్ మంత్రి బొత్స ఆధిపత్యానికి బ్రేక్ వేయాలని ప్లాన్ చేస్తున్నారు చంద్రబాబు. దీనికి ఇద్దరు సీనియర్ నేతలు ఎంతవరకు సహకరిస్తారో వేచి చూడాల్సి వుంది.

**డైలమాలో ఉమ సీటు, సిద్ధంగా లేనంటున్న బొడే ప్రసాద్..**

ఇక కీలమైన కృష్ణా, నెల్లూరు జిల్లాల్లో ఇద్దరు సీనియర్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైందని అంటున్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ టీడీపీలో చేరికతో సీనియర్ నేత దేవినేని ఉమ సీటు డైలమాలో పడింది. ఉమాను పక్కనే ఉన్న పెనమలూరుకు మార్చుతారంటూ ప్రచారం జరిగినా, ఆ సీటు వదులుకోడానికి మాజీ ఎమ్మెల్యే బొడే ప్రసాద్ సిద్ధంగా లేరు. ఆరు నూరైనా తాను పోటీ చేస్తానని బొడే ప్రసాద్ ప్రకటన చేయడంతో ఉమా సీటుపైనా హైడ్రామా కొనసాగుతోంది. ఇదే సమయంలో మైలవరం టికెట్‌పై అభ్యంతరం లేకపోయినా, వసంత కృష్ణప్రసాద్ పేరు ప్రకటించకపోవడంతో ఏదైనా మార్పు చేస్తారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**వరుసగా నాలుగు సార్లు ఓడిన సోమిరెడ్డికి నో టికెట్?**

ఇదే విధంగా నెల్లూరు జిల్లాలోని సర్వేపల్లి స్థానంపైనా తర్జనభర్జన కొనసాగుతోంది. ఈ సీటును సీనియర్ నేత సోమిరెడ్డి ఆశిస్తున్నారు. వరుసగా నాలుగు ఎన్నికల్లో ఓడిన సోమిరెడ్డికి మళ్లీ బరిలోకి దింపడంపై అధిష్టానం ఆలోచనలో పడిందంటున్నారు. ఐతే ఐదేళ్లుగా అధికార పార్టీకి వ్యతిరేకంగా పోరాటం సాగించిన సోమిరెడ్డిని తప్పించడం భావ్యం కాదనే కోణంలోనూ ఆలోచిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో సోమిరెడ్డికి ప్రత్యామ్నాయంగా ఆయన కుటుంబంలోనే ఎవరో ఒకరిని పోటీకి పెట్టే పరిస్థితి కనిపిస్తోందంటున్నారు. ఇక కర్నూలు జిల్లాకు చెందిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంను అనంతపురం జిల్లా గుంతకల్లు టికెట్ ఇస్తామని పార్టీలోకి చేర్చుకున్నారు. ఐతే అక్కడ స్థానికంగా వ్యతిరేకత ఉండటంతో గుంతకల్లు సీటును ఇంతవరకు ప్రకటించలేదు. ఇదే విధంగా శ్రీకాకుళం జిల్లా పాతపట్నం, విజయనగరం జిల్లా ఎస్.కోట, కాకినాడ జిల్లాలోని కాకినాడ సిటీ, ప్రకాశం జిల్లా దర్శి, బాపట్ల జిల్లా చీరాల, అన్నమయ్య జిల్లా రాజంపేట, కర్నూలు జిల్లాలోని ఆలూరు, కోనసీమ జిల్లాలోని అమలాపురం, అనంతపురం అర్బన్ నియోజకవర్గాలకు అభ్యర్థుల ఎంపిక టీడీపీకి తలనొప్పిగా మారిందని చెబుతున్నారు.

**చంద్రబాబు నిర్ణయంపై తీవ్ర ఉత్కంఠ..**

ఈ నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు సీట్లు ఆశిస్తుండగా, వారికి పోటీగా కొత్తగా పార్టీలో చేరిన వారు, ఎన్ఆర్ఐలు, పారిశ్రామిక వేత్తలు రంగంలోకి దిగి టికెట్లు తన్నుకుపోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఒత్తిళ్ల మధ్య 16 స్థానాలను పెండింగ్‌లో పెట్టిన అధినేత చంద్రబాబు.. చివరికి ఎటువంటి నిర్ణయం తీసుకుంటారనే ఉత్కంఠ కొనసాగుతోంది.

## నేడు కోర్టు ముందుకు కవిత

కవితకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కవిత రాత్రంతా ఈడీ కార్యాలయంలోనే ఉన్నారు. కవిత వెంట ఆమె భర్త అనిల్ కుమార్, న్యాయవాది మోహిత్ రావు ఉన్నారు. ఈడీ కార్యాలయం వద్ద 144 సెక్షన్ విధించారు.. భారీగా పోలీసులను మోహరించారు. బారికేడ్లు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఈడీ కార్యాలయంకు వెళ్లే మూడు మార్గాల్లో రెండింటిని మూసివేశారు. బీఆర్ఎస్ శ్రేణులు నిరసనకు దిగే అవకాశం ఉండటంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. కవితను ఇవాళ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ అధికారులు హాజరుపర్చనున్నారు. లిక్కర్ పాలసీ మనీలాండరింగ్ కేసు దర్యాప్తుకోసం నాగ్ పాల్ బెంచ్ ముందు హాజరుపర్చనున్నారు. కవితను ఈడీ అధికారులు కస్టడీకి కోరనున్నారు. తన అరెస్టును సవాల్ చేస్తూ కవిత ఇవాళ సుప్రీంకోర్టులో చాలెంజ్ పిటీషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. రాజకీయ కక్షసాధింపు చర్యలో భాగంగానే తనను అరెస్టు చేశారని ఆమె ఆరోపించారు. న్యాయపరంగా ఎదుర్కొంటామని అన్నారు. మద్యం కేసులో ఈడీ విచారణకు సహకరిస్తానని కవిత తెలిపారు. మరోవైపు కవిత అరెస్టును నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఆందోళనలు నిర్వహించాలని బీఆర్ఎస్ అధిష్టానం పార్టీ శ్రేణులకు ఇప్పటికే సూచించిన విషయం తెలిసిందే. కవిత అరెస్టు అక్రమం అని, ఆమెను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేయనున్నాయి.

## సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన ముద్రగడ పద్మనాభం, ఆయన కుమారుడు

లేకుండా ముద్రగడ, ఆయన కుమారుడు, పలువురు అనుచరులతో కలిసి తాడేపల్లి నివాసంకు వెళ్లి సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అయితే, ముద్రగడ పవన్ పై పోటీ చేస్తారంటూ ప్రచారం జరుగుతుంది. ముద్రగడ పోటీకిదూరంగా ఉంటే ఆయన కుమారుడు గిరి పవన్ పై వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశం ఉంది. ఈ విషయంపై రెండుమూడు రోజుల్లో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం పిఠాపురం వైసీపీ నియోజకవర్గం సమన్వయకర్తగా వంగా గీత విశ్వనాథ్ కొనసాగుతున్నారు.

# చిచ్చు రేపిన రెండో జాబితా

కమ్మ కులంలో పుట్టడం తాను చేసిన తప్పంటూ కన్నీరు పెట్టుకున్నాడు. ఇవాళ ఆయన జనసేన పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పాడేరు టికెట్ టీడీపీ అభ్యర్థి గిడ్డిశ్వరీకి కేటాయించకపోతే రాజీనామాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామంటూ గిడ్డి ఈశ్వరి వర్గీయులు తేల్చిబుతున్నారు. మరోవైపు పెందుర్తి సీటు బండారుకు కేటాయించాలని టీడీపీ శ్రేణులు ఆందోళన చేపట్టారు. మాడుగుల నియోజకవర్గం టికెట్ రామానాయుడుకు ఇవ్వాలని ఆయన అనుచరులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు విశాఖ సౌత్ నియోజకవర్గ ఇన్ ఛార్జి గండి బాబ్జీ టీడీపీకి రాజీనామా చేశారు. విశాఖ సౌత్ స్థానాన్ని జనసేన అభ్యర్థి వంశీ యాదవ్ కి కేటాయించడంతో మనస్థాపం చెందిన ఆయన ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలు ఉన్నాయి. టీడీపీ రెండో లిస్టులోనూ తన పేరు లేకపోవడంతో మాజీ మంత్రి శ్రీనివాసరావు అసంతృప్తితో ఉన్నాడు. అనుచరులతో రహస్యంగా మంతనాలు జరుపుతున్నారు. ఈ సమావేశం తర్వాత ఆయన భవిష్యత్ కార్యాచరణ ప్రకటించే అవకాశముంది. భీమిలి సీటు కోసం గంటా శ్రీనివాస్ రావు పట్టుబడుతుండగా.. చంద్రబాబు మాత్రం చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని కోరుతున్నారు. రెండో జాబితాలో తనపేరు లేకపోవటం పట్ల ఇంకా అలకలోనే గంటా ఉన్నారు. నేడు లేదా రేపు తన నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. ఇదిలాఉంటే టికెట్ దక్కలేదన్న అసంతృప్తితో ఉన్న పలువురు నేతలను చంద్రబాబు, టీడీపీ నేతలు బుజ్జగిస్తున్న పరిస్థితి. పీఠాపురం నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోటీ చేస్తున్నట్లు ప్రకటించడంతో ఆ నియోజకవర్గంలో టీడీపీ తరపున టికెట్ ఆశించిన వర్మ, ఆయన వర్గీయులు ఆందోళనకు దిగారు. దీంతో వర్మకు, అదేవిధంగా బోడే ప్రసాద్ కు చంద్రబాబు స్వయంగా ఫోన్ చేసి సమయమనం పాటిచాలని సూచించినట్లు సమాచారం.

## ఏపీ ఎన్నికల రంగంలోకి తెలంగాణ సీఎం

తొలి ఎన్నికల సభకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 16న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రాంతంలోని కృష్ణా మైదానంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించనున్నారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు నేతృత్వంలో ఏపీ కాంగ్రెస్ సీనియర్ నేతలు మైదానాన్ని పరిశీలించారు. ఈ సమావేశానికి 70 వేల మంది హాజరవుతారని ఆశిస్తున్నామని, ఈ ప్రాంతానికి కీలకమైన వీఎస్పీ ప్రైవేటీకరణను వ్యతిరేకించడమే దీని ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఉక్కు కర్మాగారం నిరసనలకు కేంద్ర బిందువుగా ఉంది, కార్మిక సంఘాలు మరియు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ 1,000 రోజులకు పైగా తమ అసమ్మతిని వ్యక్తం చేస్తున్నాయి. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ లో పార్టీ నైతిక స్థైర్యాన్ని ఈ సమావేశం పెంచుతుందని కాంగ్రెస్ భావిస్తోంది. రేవంత్ రెడ్డి రాకతో పార్టీ క్యాడర్ లో ఉత్సాహాన్ని నింపుతుందని డీసీసీ అధ్యక్షుడు గొంప గోవిందరాజు అన్నారు. ఆయన శక్తివంతమైన వాక్చాతుర్యం, నిబద్ధత పార్టీ కార్యకర్తలను ప్రభావితం చేస్తాయన్నారు.గత పదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించలేదు. తెలంగాణలో పాతుకుపోయిన బీఆర్ఎస్ ను ఓడించి ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డిని రంగంలోకి దింపడం ద్వారా వచ్చే ఎన్నికల్లో చక్రం తిప్పి ఖాతా తెరవాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఉక్కు ఉద్యమానికి చురుగ్గా మద్దతు పలుకుతున్నారు. రేవంత్ పర్యటనతో పాటు ఆమె మద్దతు ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ కు పునరుజ్జీవం చేకూరుస్తుందని భావిస్తున్నారు. రేవంత్ రెడ్డి శక్తివంతమైన ప్రసంగాలకు పెట్టింది పేరు. తెలంగాణ ముఖ్యమంత్రిగా ఆయన మాటలు ఏపీలో బలంగా ప్రతిధ్వనిస్తాయి. ఈ ఊపును వచ్చే ఎన్నికల్లో సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. విశాఖ సమావేశం తర్వాత కాంగ్రెస్ తన తదుపరి సమావేశాన్ని గుంటూరులో నిర్వహించబోతోంది, అక్కడ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ సమావేశంలో ఏపీ రాజధానిగా అమరావతిపై కాంగ్రెస్ తన వైఖరిని వెల్లడించనుంది.

# నేటి భారత్ భిన్నమైనది! తన సమస్యలను తనే పరిష్కరించుకోగలదు: విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్

**భారత్ సాధిస్తున్న ప్రగతిని ప్రపంచం గుర్తిస్తోందన్న విదేశాంగ శాఖ మంత్రి**

**తన సమస్యలకు తానే పరిష్కరించుకోగల దేశంగా భారత్‌పై అభిప్రాయం ఉందని వెల్లడి**

**విదేశాల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు గర్వంగా ఉందని వ్యాఖ్య**



భారత్‌పై ప్రపంచ దేశాల అభిప్రాయంలో మార్పులు వస్తున్నాయని విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. తన సమస్యలను తనే పరిష్కరించుకోగల దేశంగా భారత్‌పై అభిప్రాయం ఉందని అన్నారు. ఈటీ అవార్డ్స్ 2023 కార్యక్రమంలో తాజాగా ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు 'సంవత్సరం మేటి సంస్కరణకర్త' అవార్డును అందించారు. అనంతరం భారత్‌పై ప్రపంచదేశాల ధోరణిలో వస్తున్న మార్పును ఆయన ప్రస్తావించారు. "భారత్ తన సమస్యలకు తగిన పరిష్కారాలను తానే వెతుక్కోగల దేశంగా ప్రపంచం పరిగణిస్తోంది. తన అభిప్రాయాలను నిర్భీతిగా వ్యక్తం చేస్తూ, దేశ ప్రజల ప్రయోజనాలు, ఇంధన భద్రత, జాతీయ భద్రతలను పరిరక్షించగల దేశంగా అభిప్రాయం ఉంది. కాబట్టి, నేటి భారత్ భిన్నమైనది. భారత్‌కు విదేశాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు నేనెంత గర్వపడుతున్నానో మాటల్లో చెప్పలేను" అని ఆయన అన్నారు. గత కొన్నేళ్లల్లో భారత్ ప్రపంచంపై బలమైన ముద్ర వేసిందన్నారు. కొవిడ్ సంక్షోభం విసిరిన సవాళ్లను దీటుగా ఎదుర్కొందన్నారు. వ్యాక్సిన్ మైత్రీ పేరిట ప్రపంచ దేశాలకు టీకాలను భారత్ అందించిందని గుర్తు చేశారు. ఆపరేషన్ గంగా, కావేరి, అజేయ్ వంటి మిషన్లతో విదేశాల్లోని భారతీయులను ఆదుకోవడంతో పాటూ వందేభారత్ మిషన్ ద్వారా గొప్ప విజయం అందుకుందన్నారు. భారత్ సాధిస్తున్న అభివృద్ధి ప్రపంచం దృష్టిలో పడిందని అన్నారు. విదేశాల్లోని అనేక ప్రాజెక్టులు, పెరిగిన ఎగుమతులు భారత్ సాధించిన విజయాలని చెప్పారు.

## పగలు సెగలు రేగుతున్న పల్నాడు పాలిటిక్స్

ప్రచారం చేసుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీ పెదకూరపాడు నియోజకవర్గ ఇంఛార్జ్‌గా భాష్యం ప్రవీణ్‌ను ప్రకటించారు. రెండో జాబితాలో భాష్యం ప్రవీణ్ పేరు రావడంతోనే రెండు పార్టీల్లో అలెర్ట్ మొదలైంది. టీడీపీ ఇంఛార్జ్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటిని కాదని భాష్యం ప్రవీణ్‌కు అవకాశం కల్పించారు అధినేత చంద్రబాబు నాయడు. దీంతో అధిష్టానం తీరుపై కొమ్మాలపాటి అలకబూనారు. ఇది ఇలా ఉండగానే భాష్యం ప్రవీణ్ నియోజకర్గంలో అడుగు పెట్టడానికి ముందే అతని ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించి వేశారు. క్రోసూరు మండలం దోడ్లేరు, అనంతవరం వద్ద ఇప్పటికే భాష్యం ప్రవీణ్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే రాత్రి కొందరు దుండగులు వాటిని చించి వేశారు. మరో వైపు భాష్యంను అభ్యర్థిగా ప్రకటించిన రోజే అమరావతిలో టీడీపీ కార్యకర్తులు సైకిల్ వదిలి ఫ్యాన్ కిందకు చేరిపోయారు.

భాష్యం ప్రవీణ్ ఫ్లెక్సీలు చించి వేయడంపై టీడీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అమరావతి మండలం ధరణికోటలో వైసీపీ పార్టీ కార్యాలయాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి వేశారు. పెట్రోల్ పోసి తగులబెట్టడంతో కార్యాలయం అగ్నికి ఆహూతయ్యింది. అయితే ఇద్దరూ టీడీపీ కార్యకర్తలే మద్యం మత్తులో తగులబెట్టారని అనుమానిస్తూ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పూర్తి కాలిపోయిన పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే నంబూరు పరిశీలించారు. అయితే, ఎమ్మెల్యే నంబూరు శంకర్ రావు, టీడీపీ ఇంచార్జ్ భాష్యం ప్రవీణ్‌లు వరుసకు బంధువులు. ఎమ్మెల్యే అన్న అల్లుడే భాష్యం ప్రవీణ్. ఇద్దరిది తుళ్లూరు మండలం పెద్ద పరిమి గ్రామమే. ఇద్దరూ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులే. దీంతో వీరిద్దరి మధ్య గట్టి పోటీ ఉంటుందని పొలిటికల్ విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ ద్వారా నంబూరు రాజకీయ ఆరంగ్రేటం చేస్తే, వచ్చే ఎన్నికల్లో పోటీకి భాష్యం టీడీపీ ద్వారా సిద్ధమయ్యారు. 2009, 2014 ఎన్నికల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన కొమ్మాలపాటి టీడీసీ అభ్యర్థిగా గెలుపొందితే 2019లో మాత్రం రియల్ ఎస్టేట్ వ్యాపారే అయిన నంబూరు శంకర్ రావు వైసీపీ అభ్యర్థి విజయం సాధించారు. వచ్చే ఎన్నికల్లోనూ మరోసారి రియల్ ఎస్టేట్ వ్యాపారులే బరిలోకి దిగుతుండటంతో విజయం ఎవరిని వరిస్తుందో అని ఇప్పటినుండే చర్చ మొదలైంది.

# దేశప్రజలకు మోదీ బహిరంగ లేఖ!

## ఎన్నికల నేపథ్యంలో లేఖ విడుదల చేసిన వైనం



త్వరలో ఎన్నికల నగారా మోగనున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. తమ హయాంలో భారత్ సాధించిన అభివృద్ధిని ప్రస్తావించిన ఆయన వచ్చే ఎన్నికల్లో కూడా విజయం తమదేనని ఆశాభావం వ్యక్తం చేశారు.

**"ప్రియమైన నా కుటుంబసభ్యులారా..**

మన భాగస్వామ్యం దశాబ్దకాలం పూర్తి చేసుకునే దశలో ఉంది. 140 కోట్ల మంది భారతీయుల నమ్మకం, మద్దతు నాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. గత 10 ఏళ్లల్లో ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పు మా ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయం. పేదలు, రైతులు, యువత, మహిళల జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేసింది" "పీఎం ఆవాస్ యోజన ద్వారా పక్కా గృహాలు, అందరికీ విద్యుత్, నీరు, ఎల్పీజీతో పాటు ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచిత వైద్యం, రైతులకు ఆర్థిక సహాయం, మాతృ వందన యోజన ద్వారా మహిళలకు సహాయం, మరెన్నో ప్రయత్నాల విజయానికి మీరు నాపై ఉంచిన నమ్మకమే కారణం" "మన దేశం సంప్రదాయం, ఆధునికత రెండింట్లోనూ సమాంతరంగా ముందుకు సాగుతోంది. గత దశాబ్దంలో తదుపరి తరం మౌలిక సదుపాయాల్లో అపూర్వమైన నిర్మాణాన్ని చూసింది. ఈ విషయంలో ప్రతి పౌరుడూ గర్వపడుతున్నాడు. పార్లమెంటులో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి నారీ శక్తి వందన్ చట్టంతో పాటు ట్రిపుల్ తలాక్‌పై కొత్త చట్టాన్ని తీసుకొచ్చాం. జీఎస్టీ అమలు, ఆర్టికల్ 370 రద్దు, నూతన పార్లమెంటు భవన నిర్మాణం వంటి అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నాం. ఉగ్రవాదం, వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా బలమైన చర్యలు తీసుకున్నాం" "ఇలా దేశ సంక్షేమానికి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడానికి, ఆశావహమైన ప్రణాళికలను రూపొందించడానికి, వాటిని సజావుగా అమలు చేయడానికి మీ మద్దతు నాకు అపారమైన శక్తిని ఇస్తుంది. ఇక వికసిత్ భారత్‌ను నిర్మించాలనే సంకల్పాన్ని నెరవేర్చడానికి మీ మద్దతు కోసం ఎదురుచూస్తున్నాను. మనం కలిసి మన దేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తామని నేను విశ్వసిస్తున్నాను. మీ ఉజ్వల భవిష్యత్తుకు శుభాకాంక్షలతో.. మీ మోదీ" అంటూ ప్రధాని పేర్కొన్నారు.



# ఈసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న

## జై భారత్ నేషనల్ పార్టీ చీఫ్ లక్ష్మీనారాయణ

గత ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా విశాఖ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేసిన సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ ఈసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. జనసేనకు రాజీనామా చేశాక కొంతకాలం రాష్ట్రవ్యాప్త పర్యటనలు చేసిన లక్ష్మీనారాయణ ఆ తర్వాత సొంతంగా జై భారత్ నేషనల్ పార్టీ స్థాపించారు. ఈసారి ఎన్నికల్లో తాను విశాఖ నార్త్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నానని లక్ష్మీనారాయణ వెల్లడించారు. ఇవాళ విశాఖ ఎంవీపీ కాలనీలో తమ పార్టీ ఉత్తరాంధ్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీలో తృతీయ ప్రత్యామ్నాయం కోసమే యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఇటీవల జై భారత్ పార్టీ సహా 8 పార్టీలతో యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటైంది. ఈ కూటమికి లక్ష్మీనారాయణ కన్వీనర్ గా వ్యవహరిస్తున్నారు. కాగా, జై భారత్ పార్టీకి ఎన్నికల సంఘం టార్చ్ లైట్ గుర్తును కేటాయించడం తెలిసిందే.


# దుబ్బ మురుగు నీరు శుద్ధి కేంద్రం (ఎస్టీపీ1) సందర్శించిన అర్బన్ ఎమ్మెల్యే





నిజామాబాద్ జిల్లా/ వార్తా ప్రపంచం ప్రతినిధి: బొద్దుల గణేష్ కుమార్, మార్చి 15: ఇందూర్ పట్టణం :ఖానాపూర్ రోడ్ లో ఉన్న భూగర్భ మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ,యంత్రాల పరిశీలన, మురుగు నీటి శుద్ధికారణ పరిశీలించిన ధన్ పాల్ గారు మాట్లాడుతు దుబ్బ ఎస్టీపీ-1 31.5 MLD సామర్థ్యం గల ప్రాజెక్టు కు అమృత్ పథకం -1 ద్వారా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ 30 కోట్లు, వాటర్ సప్లై 98 కోట్లు ఖర్చుతో 2017 లో ప్రారంభం అయ్యి,2020 పూర్తి చేయడం జరిగిందని, అయినప్పటికీ గత ప్రభుత్వం, ఎమ్మెల్యే నిర్లక్ష్యం,కారణంగా ప్రజలకు పూర్తిస్తాయిలో అందుబాటులోకి రాలేదు అని, నగరంలో వర్షాకాలం వస్తే ప్రజలు డ్రైనేజీతో నానా ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమృత్ 2.O ద్వారా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కు 162.81కోట్లు, వాటర్ సప్లై కు 217 కోట్లు విడుదల చేసారని అన్నారు అవి టెండర్ స్థాయిలో ఉన్నాయి అని, ప్రభుత్వంతో మాట్లాడి త్వరత గతిన పనులు పూర్తి చేసి సంవత్సరం కాలంలో ప్రజలకు అందుబాటులోకి తెస్తానని హామీయిచ్చారు, అదునాతన ఈ యంత్రాల ద్వారా మురుగు నీటి శుద్ధి చేసి ఆ నీరును వ్యవసాయానికి కూడా వియోగించవచ్చని తెలియజేసారు ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, అధికారులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుపతి,డీప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నగేష్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ యోగేష్, మరియు కార్పొరేటర్స్ పంచారెడ్డి ప్రవళిక శ్రీధర్, ఎర్రం సుదీర్,ఇల్లేందుల మమతా ప్రభాకర్, సావిత రాజు, బీజేపీ నాయకులు, భాస్కర్ శివునిరి, మఠం పవన్, అంతి రెడ్డి హరీష్ రెడ్డి, బట్టి కిరి ఆనంద్, కృష్ణ మారవర్, సాయిరామ్, రంజిత్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టాన్ని తుంగలో తొక్కిన జిల్లా విద్యాశాఖ అధికారులు





నిజామాబాద్ జిల్లా/ వార్తా ప్రపంచం ప్రతినిధి: మార్చి 15: నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి మండలానికి చెందిన కట్ట నరేష్ నాయక్ పోడ్, గాండ్ల రామచందర్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయునికి సంబంధించిన సమాచారాన్ని విద్యాశాఖ అధికారులను కోరగా ప్రభుత్వ ఉపాధ్యాయుడైన గాండ్ల రామచందర్ ను కాపాడటానికి తప్పుడు సమాచారం ఇస్తూ సమాచార హక్కు చట్టం ను నిర్వీర్యం చేస్తూ, సమాచార హక్కు చట్టం వినియోగదారులను మోసం చేస్తూ, సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ,భారత రాజ్యాంగం దేశ ప్రజలకు ప్రశ్నించే హక్కును ఒక వజ్రాయుధం లాగా కల్పిస్తే విద్యాశాఖ అధికారులు మాత్రం చట్టాన్ని తుంగలో తొక్కి బుట్ట దాఖలు చేస్తున్నారు. గాండ్ల రామచందర్ అనే అక్రమార్కుడు ఒక ప్రభుత్వ ఉద్యోగ అయినప్పటికీ కుల సంఘాల జిల్లా అధ్యక్షుడనని చెప్పుకుంటూ కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేస్తున్న అధికారులు నిర్లక్ష్యం చేయడం అక్రమాలకు నిదర్శనంగా కనబడుతుంది. సదరు రామచందర్ పై ఆర్మూర్ పోలీస్ స్టేషన్లో,నందిపేట్ పోలీస్ స్టేషన్లో, డిష్పల్లి పోలీస్ స్టేషన్లో,నిజాంబాద్ రూరల్ పోలీస్ స్టేషన్లో,కామారెడ్డి కామారెడ్డి పోలీస్ స్టేషన్లో,కేసులు నమోదయ్ ఎఫ్ఆర్ ఇష్యూ చేయబడ్డప్పటికీ ఇంతవరకు ఎలాంటి మెమోలు ఇష్యూ చేయలేదని గాండ్ల రామచందర్ పై చర్యలు తీసుకోలేదని బాధితులు గగ్గోలు లు పెడుతున్నారు.అంతేకాకుండా సమాచార హక్కు చట్టాన్ని సంబంధించినటువంటి బోర్డును సైతం పనికిరాని వస్తువు లాగా ఒక మూలన పారేసి రాజ్యాంగాన్ని అవమానపరిచే విధంగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సంఘటనలు పై కనబడుతూనే ఉన్నాయి. గతంలో ఈ జిల్లా విద్యాశాఖ అధికారికి సంబంధించినటువంటి వార్తలు ఇటు ప్రింట్ మీడియాలో గాని ఎలక్ట్రానిక్ మీడియాలో గాని వచ్చినప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారి మాత్రం కనీసం చీమకుట్టినట్టైనా ప్రవర్తించకపోవడం దారుణమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు విద్యాశాఖను ప్రక్షాళన చేసి అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకొని భారత రాజ్యాంగం ప్రజలకు ఇచ్చినటువంటి గొప్ప అవకాశం సమాచారాకు చట్టాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# వినియోగదారుల హక్కుల పరిరక్షణకు పాటుపడాలి

## అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్





నిజామాబాద్ జిల్లా/ వార్త ప్రపంచం ప్రతినిధి: బొద్దుల గణేష్ కుమార్, మార్చి 15 : వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం సంబంధిత శాఖల అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో పౌర సరఫరాల శాఖ, సివిల్ సప్లైస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతలను తెలియజేస్తూ, చట్ట పరిధిలో ఎలాంటి సేవలు పొందవచ్చు, వస్తు, సేవలలో మోసాలు ఎదురైనప్పుడు ఎవరికీ ఫిర్యాదు చేయాలి తదితర వివరాలతో వినియోగదారులను చైతన్యపరిచేందుకు వీలుగా ఆర్మూర్ మండల వినియోగదారుల సంఘం ముద్రించిన కరపత్రాలను అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవలే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ప్రతినిధులను సైతం రప్పించి వివిధ రకాల వస్తువుల నాణ్యత, వాటి ప్రమాణాల గుర్తింపు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు. వినియోగదారుడు తన హక్కులు, బాధ్యతలను తెలుసుకున్నప్పుడే నాణ్యమైన వస్తువులు, సంతృప్తికర సేవలు పొందేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఒకవేళ ఏదైనా సందర్భంలో మోసాలకు గురైతే న్యాయం పొందేందుకు వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాలు దోహదపడతాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు వినియోగదారులకు వారి హక్కులు, బాధ్యతల పట్ల అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని హితవు పలికారు. నేటి రోజుల్లో అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నాణ్యమైన వస్తువులు, సేవలను గుర్తించేందుకు గల అవకాశాలను తెలియజేయాలన్నారు. కృత్రిమ మేధస్సును బాధ్యతాయుతంగా వినియోగించుకుంటే అనేక ప్రయోజనాలు పొందవచ్చని, అదే సమయంలో కృత్రిమ మేధ దుర్వినియోగమైతే దుష్పరిణామాలు కూడా తీవ్రస్థాయిలోనే ఉంటాయని అన్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు తమ హక్కుల పరిరక్షణ కోసం న్యాయపరమైన, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు సహకారం పొందేలా చైతన్యపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీ.ఎస్.ఓ చంద్రప్రకాష్, సివిల్ సప్లయిస్ డీ.ఎం జగదీశ్, డీ.ఈ.ఓ దుర్గాప్రసాద్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుదర్శనం, తూనికలు-కొలతల శాఖ అధికారి నిర్మల్ కుమార్, ఔషధ నియంత్రణ అధికారిణి శ్రీలత, జిల్లా వినియోగదారుల సమాఖ్య అధ్యక్షుడు ఎం.రాజేశ్వర్, గుజ్జ రాజేశ్వరి, రేషన్ డీలర్లు, వినోయోగదారుల సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## వైసీపీ కార్యకర్త జాన్సైదాకు నివాళులర్పించిన ఎమ్మెల్యే నంబూరు

అచ్చంపేట,,వార్తా ప్రపంచం,,మార్చి 15:- మండలంలోని పెద్దపాలెం గ్రామానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త షేక్ హుస్సేన్ కుమారుడు షేక్ జాన్ సైదా అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ విషయాన్ని గ్రామ నాయుకుల ద్వారా తెలుసుకున్న పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు గ్రామానికి చేరుకుని జాన్ సైదా భౌతికకాయం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైసీపీ నాయకులు నెల్లూరి చంద్రబాబు ఉన్నారు.




## సిపి 333 సీడ్స్ రకం మొక్కజొన్నతో అధిక దిగుబడులు

అచ్చంపేట,,వార్తా ప్రపంచం,,మార్చి 15:- చరణ్ ఓపెన్ సీడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వెరైటీ సీపీ సీడ్స్ 333 రకం మొక్కజొన్న తో అధిక దిగుబడులను సాధిస్తున్నామని తాళ్లచెరువు గ్రామ రైతులు తెలియజేస్తున్నారు. కంపెనీ వారు శుక్రవారం గ్రామంలో సిపి 333 రకం మొక్కజొన్న వేసిన పొలాల వద్ద క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ఊరి గ్రామ రైతు చెలికాని మల్లికార్జునరావు మాట్లాడుతూ తాను రెండు ఎకరాల్లో సిపి 333 రకానికి చెందిన మొక్కజొన్న విత్తనాలను వాడి ఎకరానికి 40 క్వింటాలు చొప్పున రెండు ఎకరాలకు 80 కింటాళ్ళ దిగిబడి సాధించానని చెప్పారు.అలాగే మరికొందరు రైతులు కూడా వారు పొందిన మొక్కజొన్న దిగుమతులను గురుంచి తెలియజేశారు. సిపి 333 విత్తనాల ఏరియా సేల్స్ మేనేజర్ నెల్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు తుమ్మా మర్రెడ్డి,,ఏరువ లూర్దురెడ్డి మరికొందరు గ్రామ రైతులు పాల్గొన్నారు.



## టీడీపీ నేతలపై జనసేన నేత పోతిన మహేశ్ సంచలన వ్యాఖ్యలు

విజయవాడ/ వార్తా ప్రపంచం: జనసేన పార్టీ విజయవాడ అధ్యక్షుడు పోతినేని మహేష్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పిఠాపురంలో టీడీపీ శ్రేణులు ఆందోళనకుదిగి నానా బీభత్సం సృష్టిస్తుంటే.. టీడీపీ నేతలు స్పందించక పోవటం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోతిన మహేష్ మాట్లాడుతూ.. పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీచేస్తానని పవన్ కల్యాణ్ స్వయంగా ప్రకటించారు. కానీ, పిఠాపురంలో టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగి నానా బీభత్సం సృష్టించారు. ఇంత జరుగుతున్నా టీడీపీలో కీలక నేతలు ఎవరూ స్పందించలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన అధినేత పవన్ కోసం జనసైనికులు స్పందించాలి. పార్టీ అధ్యక్షుడికే నిరసన తెలిపితే ఓట్ల బదిలీ ఎలా జరుగుతుంది..? పొత్తు ధర్మలో భాగంగా మిగతా పార్టీలుకూడా స్పందించాలని మహేష్ అన్నారు. జనసేన నుంచి కూడా రాష్ట్ర నాయకత్వం స్పందించాలి. ఎందుకు స్పందించడం లేదు? జనసేన రాష్ట్ర నాయకత్వం కూడా బయటకు వచ్చి చర్యలు చేపట్టాని మహేష్ కోరారు. గతంలో కూడా పవన్ ఓటమి పాలయ్యారు కాబట్టి ఈసారి జాగ్రత్త చర్యలు తీసుకోవటం ఇప్పుడు అవసరం అని అన్నారు. బెజవాడ పశ్చిమ సీటును జనసేనకు ఇవ్వాలి. గత ఎనిమిదేళ్లుగా పార్టీకోసం పనిచేశాను. వైసీపీ పాలనలో కేసులు పెట్టించుకున్నాం. జనసేన బలంగా ఉండబట్టే వైసీపీ సిట్టింగ్ అభ్యర్థిని మాచ్చేసింది. పొత్తులో భాగంగా పశ్చిమ సీటును జనసేనకు కేటాయించాలి. పవన్ పై పూర్తి నమ్మకం ఉంది. స్థానిక ఎన్నికల్లో మంచి ఓటు బ్యాంకు జనసేనకు వచ్చింది. గత పదేళ్లుగా నాతో పాటు పార్టీ నేతలు డబ్బు, సమయం రెండు కేటాయించాం. పశ్చిమ నియోజకవర్గం నుంచి నేను పోటీ చేస్తానని పోతిన మహేష్ అన్నారు.

# ఆటో డ్రైవర్ స్వామి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల

**స్వామి కుటుంబానికి రూ.15 లక్షల**
**ఎక్స్గ్రేషియా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించాలి**
**ప్రతి ఆటోడ్రైవర్‌కు రూ.10 నుంచి 15000 నగదు అందించాలి**
**స్కీములు ప్రకటించే ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరికి నష్టం**
**కలుగుతుంది అనే విషయాన్ని ఆలోచించుకోవాలి**



నిజామాబాద్ జిల్లా/ వార్తా ప్రపంచం ప్రతినిధి: బొద్దుల గణేష్ కుమార్, మార్చి 15: నిజామాబాద్ అర్బన్ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖిల్లా కెనాల్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ స్వామి, భార్య దేవా లక్ష్మి గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు గణేష్ బిగాల శుక్రవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరిగింది. దానికి మేము వ్యతిరేకం కాదు మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం కల్పించే ముందు ఎవరికి నష్టం జరుగుతుంది అనే ఆలోచన చెయ్యాలి ఆలోచన చేయకపోవడం వల్లే ఈరోజు ఆటో డ్రైవర్ దంపతులు పోషణ భారమై ఆత్మహత్య చేసుకున్నారు. ఆటో డ్రైవర్ దంపతులు ఆత్మహత్య చేసుకోవడం వల్ల వారి కుమారుడు అనాధగా మిగిలాడు రాష్ట్రంలో రోజుకు ఒకచోట ఆటోడ్రైవర్ ఆత్మహత్యలు జరుగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు ఆటో డ్రైవర్ స్వామి కుటుంబానికి రూ. 15 లక్షలు ఎక్స్గ్రేషియా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించాలి రాష్ట్రంలో ఉన్న ఆటో డ్రైవర్లకు రూ.10 నుంచి 15 వేల నగదు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి ఉచిత బస్ స్కీం తీసుకువచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల గురించి ఎందుకు ఆలోచన చేయడం లేదు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేయాలి. స్వామి, భార్య దేవా లక్ష్మి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతున్ని ప్రార్థించారు. వారి కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో BRS నగర అధ్యక్షులు సిర్పరాజు కార్యదర్శి ఎనగందుల మురళి,సుదాం రవిచందర్, సుజిత్ సింగ్ ,సత్యప్రకాశ్,దారం సాయిల,నవీన్,విక్రమ్ గౌడ్,సాయి, రామడుగు బాలకిషన్,రంగు సీతారాం,సదానంద్, నాయకులు రవి చందర్. రంగు సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

# పడకేసిన రేపల్లె మున్సిపాలిటీ పారిశుధ్యం, పడగెత్తిన జనసేన సైన్యం





బాపట్ల జిల్లా! రేపల్లె! వార్తా ప్రపంచం! రిపోర్టర్ భాను : జనసేన పార్టీ, టౌన్ అధ్యక్షులు అసంశెట్టి మహేష్ మాట్లాడుతూ ,రేపల్లె మున్సిపాలిటీ పరిధిలో 28 వార్డులు గాను ,ఏ ఒక్క వార్డు లో కూడా డ్రైనేజీ క్లియరెన్స్ లేదని, మురుగునీరు పారుదల లేదని వాటి మూలముగా దోమలు ఎక్కువ అవ్వటం ,వాటి మూలముగా విష జ్వరాలు ప్రవళిస్తున్నాయని నిరుపేదలు హాస్పిటల్ పాలు అవుతున్నారని రాసం శెట్టి తెలియజేసినారు. ఏ వార్డులో చూసిన చెత్త కుప్పలు ,కుప్పలుగా పెరిగిపోయి ఉన్నాయని వాటిని తొలగించటం వైసిపి నాయకులు గానీ, మున్సిపాలిటీ ఉద్యోగస్తులు గాని ఏ మాత్రం శ్రద్ధ వహించటం లేదని తెలియ చేసినారు. పట్టణ పరిధిలో ఉన్నటువంటి ప్రజల పైన పన్ను విధించి లక్షలు కి ,లక్షలు గుంజుకుంటున్నారని , ఇవి కాకుండా కోట్లాది రూపాయలు నిధులు కొల్లగొట్టి చెయ్యనటువంటి పనులకు చేసినట్టుగా బిల్లులు మార్చుకొని పర్సంటేజీలు పంచుకుంటున్నారని జనసేన నాయకులు రాసంశెట్టి ,వైసిపి ప్రభుత్వ నాయకులు పై విసుకు పడ్డారు , జరగబోయే ఎన్నికల ప్రక్రియలో భాగంగా ప్రజలు అన్ని విధాల ఆలోచించి మంచి ప్రభుత్వానికి పట్టం కట్టటానికి నిర్ణయాలు తీసుకున్నారని తెలియజేసినారు రాబోయే ప్రభుత్వం తెలుగుదేశం, జనసేన కూటమిపై ప్రభుత్వం ఏర్పడుతుందని ఆ తదుపరి అన్ని లెక్కలు తేలుస్తామని మహేష్ విలేకర్ల సమావేశంలో తెలియజేసినారు,

# స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాల తనిఖీ

**పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**
**పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పి విక్రాంత్ పాటేల్**





వార్తా ప్రపంచం /పార్వతీపురం మన్యం జిల్లా /మార్చి 15/రిపోర్టర్ వెంకటరమణ : సాధారణ ఎన్నికలకు పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం ఉల్లి భద్ర దగ్గర ఉన్న ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలను పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్ తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. మౌళిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలలో కల్పించవలసిన మౌళిక సదుపాయాలు, తీసుకోవలసిన భద్రతా ఏర్పాట్లను గురించి సిబ్బందికి ఆదేశాలు జారీచేసారు. నిరంతరం సి.సి. కెమెరాలు పర్యవేక్షణ, నిరంతరం విద్యుత్ సరఫరా ఉండాలని స్పష్టం చేశారు. బారికేడ్లు ఏర్పాటు, రాత్రి వేళలలో వెలుగు ఉండేలా విద్యుత్ సదుపాయం, రక్షిత విద్యుత్ వైరింగు చేయాలని సూచనలు చేసారు. వాహనాలు పార్కింగు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆయన ఆదేశించారు. నియోజకవర్గాలవారీగా రిసెప్షను సెంటరు ఏర్పాటు, మీడియా సెంటరు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్ ఛార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి జి.కేశవనాయుడు, రెవిన్యూ డివిజనల్ అధికారులు కె.హేమలత, ఎ.వి.రమణ, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డా ఎం వి ఆర్ కృష్ణా జి, డుమా పి.డి. కె రామచంద్రరావు, రోడ్లు భవనాలశాఖ ఇంజినీరింగ్ అధికారి ఎస్ వేణుగోపాల రావు, డిఇ అప్పాజీ, ఇన్ చార్జ్ ప్రిన్సిపాల్ ఆర్. రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# పార్టీ శ్రేణులకు ఎన్నికల నిర్వహణపై దిశా నిర్దేశం చేసిన పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు

వార్తా ప్రపంచం /పార్వతీపురం మన్యం జిల్లా /మార్చి 15/రిపోర్టర్ వెంకటరమణ : వచ్చే 2024 సాధారణ ఎన్నికల్లో వైసీపీ అధినేత వైయస్ జగన్ సారథ్యంలో రెండవ సారి ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు అని అయితే అందుకు ప్రతీ ఒక్క కార్యకర్త కూడా కీలక భూమిక పోషించి మన పార్వతీపురం నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీతో గెలిచేందుకు ప్రతీ ఒక్క పార్టీ శ్రేణులు కూడా కష్టపడి పని చేయాలని స్థానిక పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు పురపాలక సంఘం, 27 & 28వ పోలింగ్ బూత్ పరిధిలో గల 15 వార్డుల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులతో కలిసి బెలగాంలో గల సచివాలయం కన్వీనర్ కౌన్సిలర్ చీకటి అనురాధ నివాసం వద్ద నేడు సమీక్షా సమావేశం నిర్వహించి వచ్చే ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలి, వైసీపీ కి అత్యధిక పోలింగ్ ఎలా నమోదు చేయాలి అన్న అంశంలపై అందరికీ దిశా నిర్దేశం చేయడం జరిగినది. బూత్ పరిధిలో గల ప్రతీ ఒక్క ఓటర్ నీ కూడా మనం నేరుగా కలుసుకుని మన జగనన్న ప్రభుత్వం వారికి చేసిన మేలును తెలియచేయడం పాటుగా మన భవిష్యత్ మరింత బాగుండాలి అన్నా, సంక్షేమ, అభివృద్ధి పథకాలు మును ముందు కొనసాగాలన్నా అందరూ కూడా తప్పక వైయస్ జగన్ కి మద్దతుగా నిలిచి మన ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్న విషయం అందరికీ తెలియచేసి మన 27 & 28వ పోలింగ్ బూత్ లో పూర్తి స్థాయిలో మెజారిటీ సాధించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే అందరికీ పిలుపు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ల చీకటి అనురాధ, సువ్వాడ లావణ్య, బొత్స ఆనంద్, సచివాలయం కన్వీనర్లు ఎగి రెడ్డి భాస్కరరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

అచ్చంపేట,,వార్తా ప్రపంచం,,మార్చి 15:- అనారోగ్యంతో ఉండి వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందిన నెల్లూరి నరేష్ కుటుంబానికి అందిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మృతుని కుటుంబానికి అందజేశారు. మండలంలోని పెదపాలెం గ్రామానికి చెందిన నెల్లూరి నరేష్ బాబు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటూ మృతిచెందారు.వైద్య చికిత్సల సమయంలో అయిన ఖర్చుల నిమిత్తం రీ ఎంబర్స్ మెంట్ కోసం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సిఫార్సు చేశారు.దాంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 94 వేల రూపాయలు మంజూరు కాగా..అందిన చెక్కును నరేష్ బాబు భార్య నందిని కి క్రోసూరు ఉన్న తన క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు.



# గ్రాండ్ ఓపెనింగ్

నిజామాబాద్ జిల్లా/ వార్త ప్రపంచం ప్రతినిధి: బొద్దుల గణేష్ కుమార్, మార్చ్ 15: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎండల టవర్ ప్రాంతంలో ఇరానీ కేఫ్ గ్రాండ్ ఓపెనింగ్ ప్రారంభోత్సవ వేడుకల్లో నిజాంబాద్ ఎంపీ అరవింద్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నిజాంబాద్ నగర ప్రజలకు రుచికరమైనటువంటి టిఫిన్స్ తో పాటు ఇరానీ ఛాయిని అందిస్తున్నటువంటి యువకులు సన్నీ మరియు సతీష్ లకు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో ఇలాగే అంచలంచెలుగా ఎదిగి వ్యాపార రంగంలో ఉన్నత స్థాయికి చేరాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆకుల హేమలత శ్రీనివాస్, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రారంభించిన పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వార్తా ప్రపంచం /పార్వతీపురం మన్యం జిల్లా /మార్చి 15/రిపోర్టర్ వెంకటరమణ : పార్వతీపురం మన్యం జిల్లా, పాలకొండ నియోజకవర్గం, సీతంపేట మండలం మండ, దేవనాపురం, పెదరామ గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లు ప్రారంభోత్సవంలో పాలకొండ శాసన సభ్యురాలు విశ్వాసరాయి కళావతి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సాహసోపేతంగా తీసుకున్న సంస్కరణల ఫలితమే గ్రామ సచివాలయ వ్యవస్థ అని, ఇది ఆయన మానస పుత్రికని ఎమ్మెల్యే అన్నారు. శుక్రవారం సీతంపేట మండలంలో నూతనంగా నిర్మించబడిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ కేంద్రాలు భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. మండల స్థాయిలో ఉండే ప్రభుత్వ శాఖల సిబ్బంది అంతా గ్రామస్థాయిలో ఉండి, ప్రభుత్వ పరిపాలన క్షేత్రస్థాయికి తీసుకొచ్చి, సేవలను ప్రజల గడప వద్దకే అందించే నూతన ఆలోచనే సచివాలయాలు, గ్రామ వాలంటీర్ల వ్యవస్థ అన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ "ప్రజల వద్దకు పాలనని" డ్రామాలాడినట్లుగా కాకుండా , మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి ఈ సరికొత్త వ్యవస్థలే సాక్షాత్కారమన్నారు. చంద్రబాబు నాయుడు.. యువ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక పథకాలను పేరు మార్చి మోసపూరితమైన హామీలను ఇస్తున్నారని వాటిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, ఇప్పుడు ఉత్తుత్తి హామీలు ఇస్తున్నాడని విమర్శించారు. ఆయన ముఖ్యమంత్రిగా చేసిన అన్నేళ్లలో 600 హామీలు ఇచ్చి ఒక్క హామీ కూడా ప్రజలకు నెరవేర్చలేదని దుయ్యబట్టారు. పరిపాలన, సంక్షేమం, విద్య , వైద్య ,వ్యవసాయ రంగాలను పరిపుష్టి చేసి పేదలందరికీ అండగా నిలిచిన యువ ముఖ్యమంత్రి జగన్ ను మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే తో పాటుగా సీతంపేట ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ, సీతంపేట జడ్పీటీసీ ప్రతినిధి సవర రాము, ఏఎంసీ చైర్మన్ హిమరక మోహన్ రావు, వైస్ ఎంపీపీలు, జేసీయస్ కో - ఆర్డినేటర్, స్థానిక సర్పంచ్లు, స్థానిక ఎంపీటీసీలు, మండల ఎంపీటీసీలు - సర్పంచ్లు, గ్రామ సచివాలయం కన్వీనర్ లు, వైఎస్సార్సీపీ నాయుకులు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ సిబ్బంది మరియు స్థానిక గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సౌత్‌లో మోదీ సుడిగాలి పర్యటన

## ఇవాళ్టి నుంచి 5 రాష్ట్రాల్లో మకాం ఇక్కడే!



హైదరాబాద్/ వార్తా ప్రపంచం: 370 టార్గెట్‌గా.. వై నాట్ సౌత్ అని అంటోంది భారతీయ జనతా పార్టీ. ఉత్తరాది మొత్తాన్ని ఏకఛత్రాధిపత్యంగా పాలిస్తున్న కాషాయ పార్టీకి.. దక్షిణ భారతం మాత్రం అంతు చిక్కడం లేదు. బీజేపీ అంటే నార్త్ పార్టీ అని, సౌత్‌లో బలం లేదనే విపక్షాల విమర్శలకు చెక్ పెట్టేందుకు వ్యూహాత్మకంగా ముందుకెళ్తోంది. అందుకే, ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో దక్షిణాదిన పట్టు బిగించేందుకు పక్కా ప్రణాళికతో ఆపరేషన్ సౌత్‌ను రెఢి చేశారు. అంతగా పట్టులేని దక్షిణాది రాష్ట్రాల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీతో ప్రచారాన్ని హోరెత్తించాలని పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తోంది బీజేపీ.

లోక్‌సభ ఎన్నికల్లో 400కి పైగా సీట్ల గెలుపే లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ అందుకు తగ్గట్టుగానే కార్యాచరణ ప్రారంభించింది. ఎన్‌డీఏ కూటమిలోని పాత మిత్రులను తిరిగి చేర్చుకోవడంతో పాటు, వాటి సాయంతో దక్షిణాది రాష్ట్రాల్లో పాగా వేయాలని భావిస్తోంది. దక్షిణ భారతంలో ఒక్క కర్ణాటక మినహా మిగిలిన రాష్ట్రాల్లో పెద్దగా బలం లేకపోవడం, విజయాలను రుచి చూడకపోవడంతో ఆ లోటును పూడ్చుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది బీజేపీ. అందులో భాగంగానే ప్రధాని మోదీ ఇవాళ్టి నుంచి మార్చి 19వ తేదీ వరకు ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో 5 రోజుల పాటు సుడిగాలిలా పర్యటించి ప్రజలకు చేరువకానున్నారు. ఆపరేషన్ సౌత్‌లో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో పర్యటించి పలు బహిరంగ సభల్లో ప్రసంగించనున్నారు మోదీ.

తెలంగాణలో డబుల్ డిజిట్ ఎంపీ సీట్లే లక్ష్యంగా బీజేపీ అడుగులు వేస్తోంది. పదిరోజుల్లో రెండోసారి తెలంగాణకు ప్రధాని మోదీ వస్తున్నారు. రెండు రోజుల పాటు రోడ్‌షోలు, బహిరంగ సభల్లో మోదీ పాల్గొంటున్నారు. సాయంత్రం మల్కాజ్‌గిరిలో రోడ్ షోలో పాల్గొన్నారు. రేపు నాగర్‌కర్నూల్ బహిరంగ సభకు హాజరవుతారు. దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ సెగ్మెంట్ అయిన.. మల్కాజ్‌గిరిని కమలం ఖాతాలో వేసుకోవాలని ప్లాన్ చేసింది బీజేపీ. ఆ తర్వాత కర్నాటకలోని గుల్బర్గలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఇక ఎల్లుండి గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో జరిగే ఎన్డీయే బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొంటారు. వరుస పర్యటనలతో సౌతిండియాలోని రాష్ట్రాల్లో జోష్ పెంచుతున్నారు ప్రధాని మోదీ.

దక్షిణ భారతంలో మొత్తం 130 లోక్‌సభ స్థానాలున్నాయి. వాటిలో కేవలం 29 సీట్లు మాత్రమే బీజేపీ ఖాతాలో వున్నాయి. వీటిలో ఎక్కువ స్థానాలు కర్నాటకలోనే వున్నాయి. దాంతో ఉన్నవాటిని కాపాడుకోవడంతోపాటు మిగిలిన 101 సీట్లలో కనీసం 50 సీట్లు కైవసం చేసుకోవాలని బీజేపీ నేతలు భావిస్తున్నారు. కర్నాటకలో ఈసారి బీజేపీ-జేడీఎస్ పొత్తుతో మొత్త 28 ఎంపీ సీట్లలో సగానిపైగా గెలవాలని గెలవాలని ప్లాన్ చేస్తోంది. ఏపీలోని 25, తెలంగాణలోని 17, తమిళనాడులోని 39, కేరళలోని 20 ఎంపీ సీట్లు కలిపితే 91 పార్లమెంటు సీట్లలో బీజేపీ మెజార్టీ సీట్లు గెలిచేలా వ్యూహాలు రూపొందించింది. తెలంగాణలో గత పార్లమెంట్ ఎన్నికల్లో 4 ఎంపీ సీట్లు గెలవగా..ఈ సారి 12 స్థానాలు గెలవాలని కమలనాథులు ప్లాన్ చేస్తున్నారు. ఇక ఏపీలో ఎన్డీయే కూటమి కనీసం 18కి పైగా స్థానాలు గెలవాలని భావిస్తోంది. తమిళనాడులో గతంలోకన్నా%ఊ% అణ్ణామలై పాదయాత్రతో కాస్త మెరుగుపడ్డా బీజేపీ, మిత్రపక్షాలతో కలిసి ఎక్కువ స్థానాలు గెలవాలని ప్లాన్ చేస్తోంది. కేరళలో అక్కడ 45 శాతం వున్న మైనారిటీల మనసులు గెలుచుకునేందుకు బీజేపీ యధాశక్తి ప్రయత్నిస్తోంది. ఆ విషయంలో సక్సెస్సయితే అక్కడ రెండో, మూడో సీట్లు బీజేపీకి దక్కవచ్చని యోచిస్తోంది.

కేవలం రాజకీయ ఆరోపణలే కాకుండా మోదీ పర్సనల్ చరిష్మాతో సౌత్‌లో కూడా బలపడాలన్నది కమలం పార్టీ టార్గెట్. ఇందులో భాగంగా వారం రోజుల కిందట కూడా కేరళ, తమిళనాడుల్ని రౌండప్ చేశారు మోదీ. ఇవాళ కూడా తమిళనాడులోని కన్యాకుమారిలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఇదే వేదికపై శరత్‌కుమార్ దంపతులు మోదీని కలిశారు. ఈ సందర్భంగా వారసత్వ రాజకీయాలతో దేశానికి చేటు తప్పదంటూ స్టేట్‌మెంట్ ఇచ్చారు. తమిళనాడులో బీజేపీ అధికారంలోకి రాకపోయినా బీజేపీ మనస్సులో మాత్రం తమిళనాడు ఉందంటూ సెంటిమెంట్‌తో కొట్టారు. మొత్తంగా సౌత్‌పై ఫుల్ ఫోకస్ పెట్టారు ప్రధాని మోదీ. ఒక రాష్ట్రంలో పర్యటన పూర్తి చేసి, మరో రాష్ట్రానికి వెళ్లాలన్న విధానం కాకుండా ఒకేరోజున పక్కపక్క రాష్ట్రాల్లో సభలు ఉండేలా ప్రణాళికను రూపొందించారు.



## కవిత అరెస్ట్.. చంద్రబాబుని ఉద్దేశించి కేటీఆర్ చేసిన పోస్టు వైరల్

హైదరాబాద్/ వార్తా ప్రపంచం: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ(ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్) అధికారులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. మనీలాండరింగ్ చట్టం కింద ఈడీ అధికారులు కవితను అరెస్ట్ చేశారు. కాగా, కవిత అరెస్ట్ తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. రాజకీయ వర్గాల్లో దుమారం రేపుతోంది. బీఆర్ఎస్, బీజేపీ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. కవిత అరెస్ట్ అక్రమం అని, ఇందులో కుట్ర ఉందని, దీని వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. లోక్ సభ ఎన్నికల వేళ బీఆర్ఎస్ ను రాజకీయంగా దెబ్బకొట్టేందుకు ఇది బీజేపీ చేసిన కుట్ర అని తీవ్ర ఆరోపణలు చేశారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని చెబుతున్నారు. కవిత అరెస్ట్ పై స్పందించిన మాజీ మంత్రి కేటీఆర్.. ఎక్స్ లో పెట్టిన ఒక పోస్టు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు గతంలో చేసిన ఓ పోస్టును కేటీఆర్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు. ఇప్పుడా పోస్టు వైరల్ గా మారింది. సరిగ్గా 2019 సార్వత్రిక ఎన్నికల ముందు రాజకీయ ప్రత్యర్థులు లక్ష్యంగా సీబీఐ, ఈడీ లాంటి విచారణ సంస్థలను దుర్వినియోగం చేయడం బాధాకరం. బీజేపీ.. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఏ విధంగా పాల్పడుతుందో చూడొచ్చు. ఎన్నికల సమయంలో ఇలాంటి దాడులు ఎందుకు? అంటూ గతంలో చంద్రబాబు చేసిన ట్వీట్ ను.. తాజాగా కేటీఆర్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు. సీబీఐ, ఈడీ దాడుల గురించి నారా చంద్రబాబు నాయుడు కంటే నేను గొప్పగా చెప్పలేను అంటూ ఆయన కామెంట్ కూడా జత చేశారు. చంద్రబాబుని ఉద్దేశించి కేటీఆర్ చేసిన ఈ పోస్టు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీనిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

# కవితను అదుపులోకి తీసుకున్న ఈడీ

లిక్కర్ కేసులో ఏ రోజు ఏం జరిగిందో తెలుసా?

హైదరాబాద్/ వార్తా ప్రపంచం: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను అదుపులోకి తీసుకున్నారు. ఆమెను ఢిల్లీకి తీసుకెళ్లనున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవిత విషయంలో ఏ రోజు ఏం జరిగిందో తెలుసా?

**2022 ఫిబ్రవరి 21**

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవితకు నోటీసులు

**2022 ఫిబ్రవరి 26**

వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని కవితకు సీబీఐ నోటీసులు

**2022 డిసెంబర్ 11**

ఇంట్లోనే కవితను విచారించిన సీబీఐ

**2023 మార్చి 11**

తొలిసారిగా ఈడీ విచారణకు హాజరైన కవిత

**2023 మార్చి 20**

రెండోసారి ఢిల్లీలో కవితను విచారించిన ఈడీ



**2023 మార్చి 21**

కవితను మూడోసారి విచారించిన ఈడీ

మొత్తానికి ఢిల్లీ లిక్కర్ స్కాం మనీ లాండరింగ్ కేసులో గత ఏడాది మూడు రోజులు.. మార్చి 11, మార్చి 20, మార్చి 21 (27 గంటలపాటు) కవితను ప్రశ్నించింది ఈడీ.

**2024 మార్చి 15**

కవితను అరెస్ట్ చేసిన ఈడీ అధికారులు

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నివాసంలో మార్చి 15న ఈడీ, ఐటీ సోదాలు నిర్వహించాయి. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కవిత నివాసంలో సోదాలు జరిగాయి. ఆమెను ఈడీ అరెస్టు చేసింది.



# ఎలక్టోరల్ బాండ్లు.. అతిపెద్ద కుంభకోణం

## సమగ్ర దర్యాప్తు జరిపించాలి.. కాంగ్రెస్ పార్టీ డిమాండ్

బెంగళూరు: మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకం స్వతంత్ర భారతదేశంలో అతిపెద్ద కుంభ కోణమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేసింది. దర్యాప్తు పూర్తయ్యేదాకా అధికార బీజేపీ బ్యాంకు ఖాతాలను స్తంభిం పజేయాలని స్పష్టం చేసింది. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీ వేల కోట్ల రూపా యలు నొక్కేసిందని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే మండిపడ్డారు. నేను తినను, ఇతరులను తిననివ్వ నంటూ ప్రగల్భాలు పలికిన మోదీ ఇప్పుడేం సమాధానం చెబుతారని నిలదీశారు. పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు బీజేపీకి ఇంత సొమ్ము ఎందుకిచ్చారు? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన కాంట్రాక్టర్లు, అవినీ తికి పాల్పడిన బడా వ్యక్తులు ఎలక్టోరల్ బాండ్లు కొను గోలు చేసి, బీజేపీకి సమర్పించుకున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ శుక్రవారం ఆరోపిం చారు. దర్యాప్తు సంస్థల భయంతో బీజేపీకి లొంగిపో యారని అన్నారు. ఎలక్టోరల్ బాండ్ల కుంభకోణంపై ప్రజాక్షేత్రంలో వెళ్లి పోరాటం సాగిస్తా మని తెలిపారు. ఎలక్టోరల్ బాండ్ల స్కామ్‌పై విచార ణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేయా లని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ డిమాండ్ చేశారు. ఈ బాండ్ల వ్యవహారంలో క్విడ్ ప్రో కో చోటుచేసుకుందని, అవకతవకలు జరిగాయని అన్నారు. ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్ ప్రపంచంలోనే అతిపెద్ద బలవంతపు వసూళ్ల రాకెట్ అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ పథకం కింద వసూలు చేసిన సొమ్మును వివిధ రాష్ట్రాల్లో పార్టీలను చీల్చడానికి, ప్రభుత్వాలను పడగొట్టడానికి బీజేపీ దుర్వినియోగం చేసిందని రాహుల్ ఆరోపించారు. ఆయన శుక్రవారం మహారాష్ట్రలోని థానేలో మీడియాతో మాట్లాడారు. బీజేపీ మినహా ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఇచ్చిన కాంట్రాక్టులకు, ఎలక్టోరల్ బాండ్లకు మధ్య ఎలాంటి సంబంధం లేదన్నారు.

# డబ్బుపై మోజుతో చీకటి దందా..

## 8 ఏళ్లలో రూ.4 కోట్ల ఆస్తులు కూడబెట్టిన నీతూబాయి!



హైదరాబాద్, వార్తా ప్రపంచం, మార్చి 15: ఓ మామూలు కిరాణ దుకాణం నిర్వహించే మహిళ బ్యాంకు ఖాతాలో కోట్ల రూపాయల నగదుతోపాటు నగరంలోని పలు ప్రాంతాల్లో కోట్ల రూపాయల విలువైన స్థిరాస్తులు ఉండటం తెలంగాణ న్యాబ్ పోలీసులు గుర్తించారు. ఇంత పెద్ద మొత్తంలో ఎలా సంపాధించిందో తెలుసుకునేందుకు దర్యాప్తు చేపట్టిన పోలీసులకు విచారణలో విస్తుపోయే వాస్తవాలు తెలిశాయి. ఏకంగా గంజాయి దందా నిర్వహిస్తోన్న కిరాణా కొట్టు మహిళ కేవలం ఎనిమిదేళ్లలో భారీగా కూడబెట్టినట్లు గుర్తించారు. టీఎస్ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపిన వివరాల ప్రకారం.. హైదారబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో నివసిస్తోన్న నీతూబాయి సాదాసీదా కిరణా దుఖానం నడిపిస్తోంది. అయితే ఆమె బ్యాంకు ఖాతాలో రూ.1.63 కోట్ల నగదు, హైదరాబాద్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో రూ.2 కోట్ల విలువైన స్థిరాస్థులు ఉన్నట్లు తెలంగాణ న్యాబ్ పోలీసులు గుర్తించారు. నీతూబాయి కుటుంబ నేపథ్యం ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. దీంతో న్యాబ్ అధికారులు డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు. దర్యాప్తులో పోలీసులకు షాకింగ్ విషయాలు తెలిశాయి. గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయాలు సాగిస్తోన్న నీతూబాయి.. కుటుంబ సమేతంగా ఎనిమిదేళ్లలో ఇలా అడ్డగోలుగా సంపాదించినట్లు వెల్లడించారు. దీంతో నీతూబాయి, ఆమె భర్త మున్నుసింగ్ (53), సమీప బంధువులు సురేఖ (38), మమత (50)తోపాటు13 మంది గంజాయి వినియోగదారులతో కలిపి మొత్తం 17 మందిని బుధవారం (మార్చి 13) అరెస్టు చేశారు. మరో ముగ్గురు.. ధూల్‌పేటకు చెందిన అంగూరిబాయి, నానక్‌రాంగూడకు చెందిన గౌతమ్‌సింగ్, నేహాబాయి పరారీలో ఉన్నారు. అరెస్టయిన వారి నుంచి రూ.22.10 లక్షల నగదు, 22.6 కిలోల గంజాయి, 2 ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు టీఎస్ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య గురువారం మీడియాకు తెలిపారు.సులువుగా డబ్బు సంపాదించేందుకు నీతూబాయి, మున్నుసింగ్‌తోపాటు ఇతర కుటుంబసభ్యులు గంజాయి విక్రయాలు మొదలుపెట్టినట్లు ఆయన తెలిపారు.

**వీరి వ్యాపారం అలా మొదలైంది..**

ధూల్‌పేటకు చెందిన అంగూరిబాయి వీరికి ప్రధాన సప్లైదారు. అంగూరిబాయి నుంచి కిలో గంజాయి రూ.8 వేల చొప్పున కొనుగోలు చేసి 5 గ్రాముల చొప్పున చిన్న పొట్లాల్లో నింపేవారు. ఒక్కోపొట్లం రూ.500 విక్రయించేవారు. అలా కిలో గంజాయికి రూ.50 వేలు వరకు సంపాదించేవారు. అలా వచ్చిన విలాసవంత జీవితం గడుపుతున్నారు. ఖరీదైన ఇళ్లు, ఆస్థులు కూడబెట్టారు. గతేడాది ఆగస్టులో నీతూబాయికి రూ.4 కోట్ల ఆస్తులున్నట్లు గుర్తించిన పోలీసులు.. ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత కూడా ఆమె గంజాయి విక్రయాలు కొనసాగిస్తూనే ఉంది.



# రాజమౌళి సలహా పాటిస్తున్నా..

సినిమాల ఎంపిక విషయంలో అగ్ర దర్శకుడు రాజమౌళి ఇచ్చిన సలహా తన కెరీర్‌కు ఎంతగానో ఉపయోగపడిందని, ఇప్పుడు మరింత ధైర్యంతో కథల్ని ఎంచుకుంటున్నానని చెప్పింది కథానాయిక అలియాభట్. రాజమౌళి దర్శకత్వం వహించిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలో అలియాభట్ నటించిన విషయం తెలిసిందే. %ఈ సినిమా షూటింగ్ సందర్భంగా రాజమౌళి తనతో అన్న మాటలు మంత్రశక్తిలా పనిచేశాయని చెప్పింది అలియాభట్. ఆమె మాట్లాడుతూ 'తొలి నుంచి నాకు కథల ఎంపిక విషయంలో కాస్త కన్ఫ్యూజన్ ఉండేది. అనేకసార్లు ఒత్తిడికి లోనైన సందర్భాలున్నాయి. ఆ సమయంలో రాజమౌళి నాతో..'ఏ కథను ఎంచుకున్నా మీ పాత్రను బాగా ప్రేమించండి. అంకితభావంతో శ్రమించండి. అప్పుడు సినిమా ఫలితం ఎలా వున్నా మీ నటనను ప్రేక్షకులు మెచ్చుకుంటారు. ప్రేమతో చేసే పనికి మించిన గొప్ప సంతృప్తి ఈ ప్రపంచంలో మరొకటి లేదు' అని చెప్పారు.ాజమౌళిగారి సలహా పాటించిన దగ్గరి నుంచి నేను కథల్ని ఎంచుకునే పద్ధతి మారింది' అని చెప్పింది అలియాభట్. ప్రస్తుతం ఆమె వాసన్ బాలా దర్శకత్వంలో 'జిగ్రా' అనే చిత్రంలో నటిస్తున్నది.




## రజాకార్.. తెలంగాణ చరిత్రకు అద్దం పడుతుంది..

బాబీ సింహా, వేదిక, అనుష్య త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్‌దేశ్ పాండే ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రజాకార్'. సమర్‌వీర్ క్రియేషన్స్ పతాకంపై యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణ రెడ్డి నిర్మించారు. నేడు పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ చిత్రం తెలంగాణ చరిత్రకు అద్దం పడుతుందని, చక్కటి సందేశం ఉందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. రజాకార్లపై నాటి వీరుల పోరాటాన్ని ఈ సినిమా ఆవిష్కరిస్తుందని దర్శకుడు యాటా సత్యనారాయణ పేర్కొన్నారు. గత చరిత్రను నేటి తరానికి తెలియజెప్పడానికి ఈ సినిమా తీశామని, మన పోరాటయోధుల గురించి రాబోవు తరాల వారు తెలుసుకునేలా ఈ సినిమా ఉంటుందని నిర్మాత గూడూరు నారాయణ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



## తలైవాకు జీవితాంతం రుణపడి ఉంటా : రితికా

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్‌కు తాను జీవితాంతం రుణపడి ఉంటానని కోలీవుడ్ హీరోయిన్ 'గురు' సినిమా ఫేమ్ రితికా సింగ్ అన్నారు. సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'వెట్టయాన్' . తెలుగులో వేటగాడు అని వస్తున్న ఈ సినిమాకు జై భీమ్ ఫేమ్ టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇక ఈ సినిమాలో రితికా సింగ్ కీ రోల్ ప్లే చేస్తుంది. ఈ సందర్భంగా రజనీకి రితికా ధన్యవాదాలు తెలిపింది. రజనీకి ఉన్న దయాగుణం, ప్రేమ సాటిలేనివని.. అంతటి గొప్ప వ్యక్తితో తాను కలిసి పనిచేయడం అనేది జీవితంలో మరచిపోలేని ఒక సంఘటన అని రితికా వెల్లడించింది. ఇక 75% షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభంకాగా.. ఈ షూటింగ్‌లో పాల్గోనడానికి రజినీకాంత్ కూడా చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చారు. ప్రస్తుతం హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. అమితాబ్, ఫహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, దుషారా విజయన్ ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## సామాజిక సందేశంతో ది 100



ఆర్కే సాగర్ కథానాయకుడిగా రాఘవ్ ఓంకార్ దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం 'ది 100'. క్రియా ఫిల్మ్ కార్ప్, ధమ్మ ప్రొడక్షన్స్ పతాకాలపై రమేష్ కరుటూరి, వెంకీ పూశడపు, జే.తారక్‌రామ్ నిర్మిస్తున్నారు. గురువారం ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో హీరో ఆర్కేసాగర్‌ను ఐపీఎస్ అధికారి విక్రాంత్‌గా పరిచయం చేశారు. 'ఇది కేవలం నెంబర్ కాదు..ఒక ఆయుధం' అంటూ సినిమా టైటిల్ గురించి వీడియో క్లిప్‌లో చూపించారు. ఈ సినిమా కథాంశం చాలా బాగుందని, చక్కటి సందేశంతో ఆకట్టుకుంటుందని వెంకయ్య నాయుడు ప్రశంసించారు. ఓ సోషల్ ఇష్యూని కమర్షియల్ అంశాలు మేళవించి చూపించామని దర్శకుడు తెలిపారు. ఫ్యామిలీ ఆడియెన్స్‌ను మెప్పించే చిత్రమిదని హీరో ఆర్కే సాగర్ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ కె నాయుడు, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: రాఘవ్ ఓంకార్ శశిధర్.



## గుడ్ బ్యాడ్ అగ్లీ

తమిళ అగ్ర కథానాయకుడు అజిత్ నటిస్తున్న తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తమిళ, తెలుగు భాషల్లో మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తున్నది. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలు. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. జూన్‌లో షూటింగ్‌ను ప్రారంభించి వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ మాట్లాడుతూ 'అజిత్ వంటి అగ్ర హీరోతో పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాం. ఆయన ఇమేజ్‌కు తగినట్లుగా దర్శకుడు అధిక్ రవిచంద్రన్ అద్భుతమైన కథను తయారు చేశాడు. ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించే యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది' అన్నారు. వినూత్నమైన కథతో, గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో ఈ సినిమా అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: అభినందన్ రామానుజం, రచన-దర్శకత్వం: అధిక్ రవిచంద్రన్.

## నేను పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న : రామ్ గోపాల్ వర్మ



జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రానున్న ఎన్నికల్లో పిఠాపురం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటి చేయనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతానికి ఎంపీగా పోటీ చేసే ఆలోచనలో లేనని , ఎమ్మెల్యేగానే పోటీ చేయాలని ఉందని స్పష్టం చేశారు. అయితే పవన్ కళ్యాణ్ ఇలా ప్రకటించాడో లేదో దీనికి సెటైరికల్‌గా ఆర్జీవీ తాజాగా ఒక పోస్ట్ పెట్టాడు. ఈ పోస్టులో తాను వచ్చే ఎన్నికల్లో పిఠాపురం నుంచి పోటీచేయబోతున్నట్లు ప్రకటించాడు. సడన్‌గా తీసుకున్న నిర్ణయం.. నేను పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నాను అని చెప్పడానికి సంతోషిస్తున్నాను అంటూ ఆర్జీవీ ఎక్స్ వేదికగా రాసుకోచ్చాడు. దీంతో ఇది చూసిన నెటిజన్లు ఆర్జీవీ పవన్ పై సెటైరికల్ గా ఈ ట్వీట్ చేశారా..? లేక నిజంగానే పవన్ కు పోటీగా ఆర్జీవీ కూడా పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నారా.? అని కామెంట్లు పెడుతున్నారు. ఇక పవన్ కళ్యాణ్ విషయానికి వస్తే.. 2019 ఎన్నికల్లో గాజువాక, భీమావరం నుంచి పోటీ చేసిన పవన్ రెండు స్థానాల్లో ఓటమి పాలయ్యాడు.



## ఆసుపత్రిలో చేరిన అమితాబ్ బచ్చన్

బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. 81 ఏండ్ల బిగ్ బి గుండెకు సంబంధించిన నొప్పితో బాధపడుతుండగా.. యాంజియోప్లాస్టీ సర్జరీ కోసం ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో చేరినట్లు సమాచారం. ఇక ఈ విషయం తెలుసుకున్న బిగ్ బి అభిమానులు ఆయన త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

## హనుమాన్ ఓటీటీ ఆలస్యం కావాలని చేయట్లేదు : ప్రశాంత్ వర్మ

టాలీవుడ్ స్టార్ దర్శకుడు ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం హనుమాన్ . తేజ సజ్జా కథా నాయకుడిగా నటించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రం రూ.300 కోట్లకు పైగా వసూళ్ళను రాబట్టింది. అయితే థియేటర్‌లో విడుదలై రెండు నెలలకు పైగా అయిన ఇప్పటివరకు ఓటీటీలోకి రాలేదు. ఈ చిత్రం ఓటీటీ అనౌన్స్‌మెంట్ అయితే వచ్చింది కానీ అనుకోని కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తుంది. అయితే ఓటీటీ వాయిదా పడుతూ వస్తుండటంపై తాజాగా దర్శకుడు ప్రశాంత్ వర్మ ఎక్స్ వేదికగా స్పందించాడు. హనుమాన్ ఓటీటీ స్ట్రీమింగ్ ఆలస్యం కావడం అనేది ఉద్దేశపూర్వకంగా చేస్తున్నది కాదు. మేము రాత్రింబవళ్లు కష్టపడి మీకు బెస్ట్ అవుట్‌పుట్ అందించాలని చూస్తున్నాము. మా ఉద్దేశ్యం ఎల్లప్పుడూ మీకు ఉత్తమమైనది ఇవ్వాలని చూస్తాము కానీ మరేమీ లేదు. దయచేసి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. అలాగే మాకూ సపోర్ట్ చేయండి. ధన్యవాదాలు అంటూ ప్రశాంత్ వర్మ రాసుకోచ్చాడు.





## 'తంగలాన్' థియేటర్లలోకి వచ్చేది అప్పుడే : పా.రంజిత్

కోలీవుడ్ హీరో చియాన్ విక్రమ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం తంగలాన్. ఈ సినిమాకు 'కబాలి', 'కాలా', 'సర్పట్ట పరంపర' చిత్రాల ఫేమ్ పా రంజిత్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇక ఇప్పటికే చిత్రం నుండి విడుదలైన ప్రచార చిత్రాలు, టీజర్ సినిమాపై భారీ అంచనాలను పెంచేశాయి. అయితే ఈ సినిమాను మొదట జనవరి 26 విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేసిన విషయం తెలిసిందే. అనుకోని కారణాల వలన వాయిదా పడింది. ఇక ఆ తర్వాత ఫిబ్రవరిలో విడుదల చేద్దామనుకున్నారు మేకర్స్. కానీ అప్పుడు కూడా ఈ సినిమాకు కలిసి రాలేదు. ఇక ఈ సినిమా ఎప్పుడు విడుదలవుతుందా ఎప్పుడెప్పుడు చూద్దామా అని ప్రేక్షకులు ఎదురుచుస్తుండగా మూవీ విడుదలపై సాలిడ్ అప్‌డేట్ ఇచ్చాడు దర్శకుడు.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గోన్న దర్శకుడు పా. రంజిత్‌ను మీడియా 'తంగలాన్' విడుదల ఎప్పుడు అని అడుగగా.. రంజిత్ స్పందిస్తూ.. తంగలాన్ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల తేదీల ప్రకటన కోసం ఎదురుచూస్తున్నాం. ఎన్నికలు పూర్తయిన తర్వాత సినిమా విడుదల చేస్తాం. ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నా అని పా.రంజిత్ పేర్కొన్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (కేజీఎఫ్)లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా వస్తోన్న ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై కేఈ జ్ఞానవేళ్ రాజా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, పార్వతి తిరువొతు ఫీ మేల్ లీడ్ రోల్స్ లో నటిస్తుండగా.. 'సర్పట్ట పరంపర' ఫేమ్ పశుపతి, డానియెల్ కల్టగిరోన్ కీ రోల్స్ పోషిస్తున్నారు.

## జపాన్‌లో ఆర్‌ఆర్‌ఆర్ క్రేజ్..



టాలీవుడ్ దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన సూపర్ హిట్ చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్' . స్టార్ నటులు జూనియర్ ఎన్టీఆర్ , రామ్‌చరణ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీ ఎన్నో రికార్డులను తిరగరాసింది. పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ప్రపంచ సినీరంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డును కూడా సొంతం చేసుకుంది. ఇక ఈ చిత్రం విడుదలై రెండేళ్లు కావొస్తున్నా క్రేజ్ మాత్రం తగ్గడం లేదు. అందుకు ఉదాహరణ లేటెస్ట్ జపాన్ షో బుకింగ్స్. 'ఆర్‌ఆర్‌ఆర్' రిలీజ్ సమయంలో చిత్ర బృందం జపాన్ వెళ్లి ప్రత్యేకంగా ప్రమోషన్స్ చేసిన విషయం తెలిసిందే. ఇక తారక్‌కు జపాన్‌లో ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువే. దీంతో అక్కడ ఈ చిత్రం రిలీజై ఏడాదిన్నరైనా ఇప్పటికీ థియేటర్స్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో మార్చి 18వ తేదీన ఓ షోకి రాజమౌళి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న జపాన్ అభిమానుల నుంచి ఊహించిన స్పందన వచ్చింది. మార్చి 18వ తేదీ షోకి బుధవారం రాత్రి టికెట్స్ ఓపెన్ చెయ్యగా.. ఒక్క నిమిషంలోపే టిక్కెట్స్ అన్నీ అమ్ముడుపోయాయి. ఈ విషయాన్ని 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. "ఆర్‌ఆర్‌ఆర్' సినిమా జపాన్ థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఏడాదిన్నరగా సినిమా అక్కడ ఆడుతోంది. మార్చి 18వ తేదీన జరిగే షో టిక్కెట్స్ ఒక్క నిమిషంలోపే అమ్ముడుపోయాయి' అని పేర్కొంది. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్లు 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

Vartha prapancham Telugu Daily, Printed, Edited Published and Owned by Dr. Bandi Surendra Babu, D.NO 6-9-15A Arundal pet Guntur 522002, Andhra pradesh, Printed at Sri Lakshmi Printers, D.NO 104-25-11 Nagaralu, Amaravati Road, Guntur-522007, Andhra pradesh
Published from H.NO3-5-136/6, N.No177/A, SHIVA NAGAR , ATTAPUR, RAJENDRA NAGAR, HYDERGUDA, K.V RANGAREDDY, TELANGANA STATE-500048 Printed at Vartha prapancham press H.NO3-5-136/6, N.No177/A, SHIVA NAGAR , ATTAPUR, RAJENDRA NAGAR, HYDERGUDA, K.V RANGAREDDY, TELANGANA STATE-500048
Mobile: 7799141459, Mail us: Vartha Prapancham info@gmail.com, Visit us. www. Vartha prapancham.com